

డీఎస్సీ పోస్టులు 811?



భర్తీ దిశగా వడివడి అడుగులు

స్కూల్ అసిస్టెంట్ 628, ఎస్‌జీటీ 183

ఐదేళ్ల తరువాత నిరుద్యోగుల్లో ఆనందం

చంద్రబాబు తొలి సంతకం నిరుద్యోగుల ఆశలకు జీవం పోసింది. ఇచ్చిన మాట మేరకు ఆయన మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. కేబినెట్ తొలి భేటీలోనే ఆమోదం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 811 ఖాళీలను భర్తీ చేస్తారని విశ్వసనీయంగా తెలిసింది. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 628, ఎస్‌జీటీ పోస్టులు 183 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల విలీనం కోసం వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 117ను రద్దు చేస్తే.. ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

(పూర్తి వివరాలు 7లో)

టీ స్టాల్‌కు ఆఫీస్ ఫైళ్లు

● సమగ్ర శిక్ష ఉద్యోగుల నిర్వాకం ● బదిలీపై వెళ్లిన అధికారి ఆదేశాలతో..

అనంతపురం విద్య, జూన్ 25: సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీస్ ఫైళ్లను కొందరు ఉద్యోగులు కార్యాలయం బయటకు తరలించినట్లు సమాచారం. ప్రాజెక్టులో ఇటీవలి వరకూ సూపరింటెండెంట్‌గా పనిచేసి.. మరో జిల్లా బదిలీపై వెళ్లిన ఓ అధికారి, ఇద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారం నడిపించారని ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిపోయిన సూపరిటెండెంట్ ఒత్తిడి చేయడంతో ఆఫీస్‌లోని పలు ఫైళ్లను ఇక్కడ పనిచేసే ఓ క్లర్క్, ఓ అటెండర్ టీ స్టాల్‌కు మోసుకువెళ్లారు. అక్కడ మకాం వేసిన బదిలీ సూపరింటెండెంట్.. ఆ ఫైళ్లను పరిశీలించడం అనుమానాలకు తావిస్తోంది. ఐఏఎస్ అధికారి ఏపీసీగా ఉన్న ప్రాజెక్టు ఆఫీస్ నుంచి ఫైళ్లు బయటకు వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఆఫీస్‌లో ఉండాల్సిన ఫైళ్లు బయటకు వెళ్లినా ఎవరూ పట్టించుకోకపోతే.. చెక్‌బుక్స్, ముఖ్యమైన రికార్డులు, ఫైళ్లు మాయమయ్యే ప్రమాదం ఉంటుందన్న ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ వ్యవహారంపై ప్రాజెక్టు ఉన్నతాధికారి ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



మంజూరు కాకున్నా తోపు సంస్థ నిర్మించిన జగనన్న ఇళ్లు..

జగనన్న ఇళ్ల సామగ్రితో ఆలమూరులో బ్రిక్స్ ప్లాట్ ఫారం



జగనన్న ఇళ్ల సామగ్రితో నిర్మించిన అమ్మ డెయిరీ

దొరికినంత దోచేశారు..!

సిమెంట్, కంకర, ఇసుక, స్టీల్.. అన్నీ పక్కదారి

అమ్మ డెయిరీ, సీసీ రోడ్లకు అక్రమ వినియోగం

మంజూరు కాని ఇళ్లను నిర్మించి.. ఆన్‌లైన్‌లోకి..

ఓటమి తరువాత స్టీల్‌ను కాజేయాలని కుట్ర

హైసింగ్‌లో అనకొండ.. తోపుదుర్తి అక్రమాలు



అనంతపురం సిటీ, జూన్ 25: జగనన్న ఇళ్ల నిర్మాణం పేరిట వైసీపీ హయాంలో భారీ దోపిడీ జరిగింది. అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, అయనకు అనుకూలంగా వ్యవహరించిన హౌసింగ్ అనకొండ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టు దక్కించుకున్న రాక్రీట్ సంస్థ ద్వారా వివిధ రూపాల్లో రూ.వందల కోట్లు కాజేశారు. జరిగిన పనికంటే ఎక్కువ బిల్లులు చేయడం, సిమెంటు, ఇసుక, స్టీల్‌ను స్టాక్ పాయింట్ నుంచి గుట్టుగా పక్కదారి పట్టించడం వంటి అక్రమాలకు పాల్పడ్డారు. సిమెంట్ రోడ్లకు, అమ్మ డెయిరీ, బ్రిక్స్ ప్లాట్‌ఫారం, సిమెంట్ గోడౌన్ నిర్మాణాలకు సైతం జగనన్న ఇళ్ల సామగ్రినే వినియోగించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తోపు సమీప బంధువు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నందకుమార్‌రెడ్డి, తోపు స్నేహితుడైన రాక్రీట్ సూపర్‌వైజర్ అమర్నాథరెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిసింది. ఈ లెక్కలను సరిచేసే బాధ్యతను అనకొండ తీసుకున్నారని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రాక్రీట్ సంస్థ 50,385 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా.. కేవలం 1500 ఇళ్లను పూర్తి చేసింది. వీటికి ఏకంగా రూ.350 కోట్లు బిల్లులు చేసుకుంది. జిల్లాలోనూ ఇదే స్థాయి అక్రమాలు జరిగాయి.

వెయ్యి టన్నుల ఐరన్..

నిర్మాణ పనులకు అవసరమైన మేరకు స్టీల్ తెప్పించాల్సి ఉంటుంది. కానీ ఎన్నికలకు ఏడాది ముందు ఏకంగా రూ.ఆరు కోట్లు విలువ చేసే 1000 టన్నుల స్టీల్‌ను తెప్పించి కొడిమి జగనన్న లే అవుట్‌లో ఉంచారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతే రాక్రీట్ సంస్థకు ఏలాంటి ఇబ్బంది ఉండకూడదన్నట్లు వ్యవహరించారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆ స్టీల్ వానకు తడిసి, ఎండకు ఎండి తుప్పు పడుతోంది. ప్రజాధనం మట్టిపాలు అవుతోంది. ప్రభుత్వం మారడంతో ఆ స్టీల్‌ను మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని అనకొండ, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి పథకం వేశారు. కానీ స్థానికులు అడ్డుకోవడంతో వారి పాచిక పారలేదు.

మంజూరు కాకున్నా..

ప్రభుత్వం మంజూరు చేస్తేనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి. కానీ నగర శివారులోని ఆలమూరు, కొడిమి జగనన్న లే అవుట్‌లో రాక్రీట్ సంస్థ తెరవెనుక రాజకీయం చేసింది. సుమారు రూ.2.50 కోట్లు ఖర్చు చేసి 320 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరోసారి తమదే అధికారం అన్న ధీమాతో అనకొండ సహకారంతో చకచకా పనులు చేయించేశారు. దాదాపు 60 శాతం పనులు పూర్తి చేశారు. కానీ టీడీపీ కూటమి విజయంతో ఆపనులను ఎక్కడికక్కడ ఆపేశారు. మంజూరు కాని ఇళ్లను నిర్మించినందుకు అయిన ఖర్చును లబ్ధిదారుల నుంచి ఎలా వసూలు చేయాలో తెలియక జుట్టు పీక్కున్నారు. చేసేదీ లేక.. అనకొండ ఇంజనీరు ఎవరికీ అనుమానం రాకుండా రికార్డులను తారుమారు చేసి, ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 120 పాత ఇళ్లకు బిల్లులు చేసిన.. అనకొండ భారీగా సొమ్ము చేసుకున్నారని సమాచారం.

రూ.వందల కోట్లు దోచారు

రాక్రీట్ సంస్థ చేసిన పనులకు.. పొందిన బిల్లులకు పొంతన లేదని గృహ నిర్మాణ శాఖ వర్గాలు అంటున్నాయి. ఆ శాఖ అనకొండ సహకారంతో ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్ రూపంలో భారీగా దోచేశారని అంటున్నారు. తోపు బినామీల పేరిట పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో చేసిన సిమెంట్ రోడ్ల పనుల్లోనూ భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. కక్కలపల్లి, పాపంపేట, బండమీదపల్లి తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లకు హౌసింగ్ సామగ్రిని వినియోగించి, అడ్డదారిలో బిల్లులు చేసుకున్నారని సమాచారం. ఇందుకు పీఆర్ అధికారులు కూడా సహకరించారని తెలిసింది. జేఎన్‌టీయూ సమీపంలో జగనన్న లే అవుట్ కోసం సేకరించిన మూడు ఎకరాలను తోపుదుర్తి సోదరుల్లో ఒకరు, ఎంపీపీ స్థాయి నాయకుడు కలిసి కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. ఆ భూమిలో లే అవుట్ రోడ్లు వేయడానికి మట్టి తరలించి, ఎంపీడీఓ ద్వారా బిల్లులు చేయించారు. కానీ జగనన్న లే అవుట్ ఏర్పాటు చేయకుండా.. భూమిని కాజేశారు. ఈ వ్యవహారంలో అనకొండ పాత్ర కీలకమని తెలిసింది. అమ్మ డెయిరీ సమీపంలోని ఓ రైతుకు చెందిన ఐదు ఎకరాల భూమిని బెదరించి లాక్కున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలా సుమారు రూ.500 కోట్ల దాకా దోచేశారని సమాచారం.

అక్రమార్కుల టీం వర్క్

తోపు అక్రమాల గురించి అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. జగనన్న కాలనీలను మింగేసినా, గృహ నిర్మాణ సామగ్రిని పక్కదారి పట్టించినా స్పందించలేదు. ఐదేళ్ల హౌసింగ్ దందాలో అనకొండతోపాటు ఇన్‌చార్జి పీడీ, ఇద్దరు డీఈఈలు, ఇద్దరు ఏఈలు, ఓ ఎంపీడీఓ కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు డీఈఈలో ఒకరు మాజీ సీఎం జగన్‌కు సమీప బంధువు అని తెలిసింది. ప్రభుత్వం మారడంతో అవినీతికి పాల్పడిన అధికారులలో వణుకు మొదలైంది. వీరిలో పలువురు సెలవులో వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం.

గిరిజన సర్పంచ్‌కు న్యాయం

వైసీపీ హయాంలో వేధింపులు

పనులు చేసినా ఎంబుక్ రికార్డు చేయలేదు

ఏడాదిపాటు గౌరవ వేతనాన్ని చెల్లించలేదు

ఎమ్మెల్యే జయరాం చొరవతో కదిలిన ఫైళ్లు



నక్కనదొడ్డిలో బోరు బావి పనులు (ఫైల్)

గుంతకల్లు, జూన్ 25: టీడీపీ మద్దతు సర్పంచు వరలక్ష్మి పోరాటం ఫలించింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చొరవతో నక్కనదొడ్డి పంచాయతీలో ఆమె చేసిన అభివృద్ధి పనుల వివరాలు ఎంబుక్‌లోకి ఎక్కాయి. ఆమెకు దక్కాల్సిన గౌరవ వేతనాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వైసీపీ హయాంలో నక్కనదొడ్డి పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో గ్రామస్థులు 'జగనన్నకు చెబుదాం' హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించి, వెంటనే తాగునీటి పనులు చేయించాలని, నిధులను చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో సర్పంచ్ వరలక్ష్మి రెండేళ్ల కిందట సొంత డబ్బులు వెచ్చించి బోరు బావి తవ్వించి, పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. పారిశుధ్య పనులకూ సొంత డబ్బును ఖర్చు చేశారు. కానీ ఆ పనుల వివరాలు ఎంబుక్‌లో రికార్డు కాకుండా వైసీపీ నాయకులు అధికారులను నియంత్రించారు. ఆమెకు సంవత్సర కాలానికి మంజూరైన గౌరవ వేతనాన్ని కూడా పంచాయతీ ఖాతాలోకి జమ చేయనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో బాధిత సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాను గిరిజన మహిళనని, అంత డబ్బు పెండింగ్‌లో పెడితే పంచాయతీ పనులు ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా న్యాయం జరగలేదు. సీఎం పేషీకి ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు.

ఎమ్మెల్యే చొరవతో..

ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం వద్ద నక్కనదొడ్డి సర్పంచు వరలక్ష్మి తన గోడు వెళ్లబోసుకున్నారు. గెలిచిన వెంటనే సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. సర్పంచును పిలిపించి, తన సోదరుడు శ్రీనివాసులును అధికారుల వద్దకు పంపించారు. మండల అభివృద్ధి అధికారులు ఇంజనీరింగ్ అధికారిని పంపి, సర్పంచు చేసిన పనులకు సంబంధించి రూ.13 లక్షల మేరకు ఎంబుక్ రికార్డు చేశారు. ప్రభుత్వ నిధులు వచ్చిన వెంటనే బిల్లుల చెల్లింపు జరిగేలా రికార్డులు సిద్ధం చేశారు. సర్పంచుకు ఇవ్వాల్సిన రూ.36 వేలు ఆమె ఖాతాలో జమచేశారు.

పిలిచి మరీ న్యాయం చేశారు..



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎమ్మెల్యే నన్ను పిలిపించి సమస్యను పరిష్కరించారు. నేను చేయించిన పనులకు ఎంబుక్ రికార్డు చేయించారు. టీడీపీ సర్పంచు అన్న కారణంగా వైసీపీ ప్రభుత్వం నన్ను ఇబ్బంది పెట్టింది. బిల్లులు ఇవ్వడం అటుంచి, చేసిన పనులకు ఎంబుక్ రికార్డు చేయకుండా వేధించారు. టీడీపీ ప్రభుత్వం రావడంతో మాకు న్యాయం జరిగింది.

- వరలక్ష్మి, నక్కనదొడ్డి సర్పంచ్

అతిసారతో ఒకరి మృతి

రామగిరి ఎగువ తండాలో విజృంభణ

ఐదు రోజుల్లో ముగ్గురి మృత్యువాత

జిల్లా ఆస్పత్రిలో 60కి చేరిన బాధితులు



రేణుకాబాయి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



రేణుకాబాయి

పామిడి/అనంతపురం టౌన్, జూన్ 25: పామిడి మండలం రామగిరి ఎగువ తండాలో అతిసార ప్రబలింది. వాంతులు, విరేచనాలతో తండాకు చెందిన బి.రేణుకా బాయి(26) మంగళవారం మృతి చెందింది. గడిచిన ఐదు రోజుల్లో తండాలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. కానీ ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఈ నెల 21న ఆర్.బద్దమ్మ(65), 22న ఆర్. రాము నాయక్ (45) అతిసారతో మృతి చెందారు. ఆ తర్వాత మంగళవారం సాయంత్రం రేణుకబాయి మృతి చెందింది. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 20 కుటుంబాలవారు అతిసారతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరారు. సాధారణ వాంతులు, విరేచనాలుగా భావించి మొదట్లో ప్రథమ చికిత్సతో సరిపెట్టారు. కానీ ముగ్గురి ప్రాణాలు పోవడంతో అందరిలో ఆందోళన నెలకొంది. తండావాసులు పలువురు అనంతపురం జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయ్యారు.

పెరుగుతున్న బాధితులు

జిల్లా ఆస్పత్రిలో అతిసార బాధితులు 60 మంది చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. సోమవారం వరకు 40 మంది బాధితులు ఉండగా.. మంగళవారం మరో 20 కేసులు పెరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. వీరిని అడ్మిషన్ చేసుకుని చికిత్స అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉరవకొండలో అతిసార ప్రబలడంతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత తమ సిబ్బందితో మంగళవారం అక్కడికి వెళ్లారు. దాదాపు రెండు నెలలుగా ఆ నియోజకవర్గంలో అతిసార కేసులు నమోదు అవుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం మూడు కేసులు మాత్రమే ఉన్నాయని తేల్చారు. వజ్రకరూరు, కూడేరు, ఉరవకొండ మండలాలకు చెందిన ఒక్కొక్కరు ఉరవకొండలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి మెరుగ్గా ఉందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ తెలిపారు.

అవినీతి గాథలు వినండహో..!



అధికారమే అండగా చెలరేగిన ఇద్దరు పీడీలు

డీఆర్‌డీఏ, డ్వామాలో రూ.కోట్ల దుర్వినియోగం

వైసీపీ కార్యాలయాలుగా మార్చిన అధికారులు

ఎన్నికల విధులకు ఆ ఇద్దరిని దూరంపెట్టిన ఈసీ

బదిలీనా..వేటా? జోరుగా సాగుతున్న చర్చ



డ్వామా కార్యాలయం





డీఆర్‌డీఏ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 25: ఓ ఇద్దరు అధికారులు వైసీపీ పాలనలో చెలరేగిపోయారు. ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేశారు. ఐదేళ్లలో అడిగేవారు లేకపోవడంతో అధికార దుర్వినియోగం, రూ.కోట్లలో నిధుల స్వాహా పర్వం సాగింది. వైసీపీ నేతల అండదండలు, ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉండటంతో ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోయింది. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేసి విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడ్డారు. ప్రభుత్వ అధికారుల కంటే వైసీపీ కార్యకర్తల్లా పని చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వైసీపీ నేతల సిఫారసులకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ అవినీతి, అక్రమాల సొమ్ముల్లోనూ వారికి వాటాలు పంచడం గమనార్హం. ఆ ఇద్దరు అధికారులే డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామాలలో పీడీలు. ఇటీవల రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో తమ అవినీతి, అక్రమాల బాగోతం బయటపడుతుందనే భయం వీరిని వెంటాడుతోంది. అందుకే తమ సొంత శాఖలకు వెళ్లిపోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

నిధుల దుర్వినియోగం

వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 సంవత్సరంలో డీఆర్‌డీఏ-వైకేపీ పీడీగా వచ్చిన పీడీ నరసింహారెడ్డి కేవలం ఎంపీడీఓ. అంటే ఆయన స్థాయి ఒక మండల అధికారి. ఒక మండల అధికారిగా వచ్చిన ఆయన జిల్లా స్థాయిలో అధికారపార్టీ నేతల అండదండలతో పాతుకుపో యారు. పీడీగా వచ్చిన కొత్తలో కరోనా సమయంలో ప్రజలకు మాస్కులు పంపిణీ బాధ్యత అప్పగించారు. దీంతో మాస్కుల పంపిణీ ముసుగులో సుమారు రూ.1.5కోట్లు కాజేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆ తరువాత 75ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలకు గాను 2022లో జాతీయ జెండాల పేరుతో సుమారు రూ.15లక్షలు తన సొంత ఖజానాలోకి వేసుకున్నారు. ఇక తరువాత వైసీపీ నేతలు చేసిన సిఫారసుల ప్రకారం అర్హతలేని సుమారు 20వేల మందికి పైగా పింఛన్ జాబితాలోకి ఎక్కించారు. పెరటికోళ్ల పెంపకం పేరుతో సుమా రు రూ.60లక్షలు, స్వయం సహాయక మహిళా సంఘాలకు నోటు పుస్తకాలు పేరుతో రూ.30లక్షలు స్వాహా చేశారు. ఇక మహిళా మార్టులు ఏర్పాటు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా మహిళల నుంచి రూ.100చొప్పున వసూలు చేశారు. కేవలం నార్పలలో మహిళా మార్టు ఏర్పాటు చేసి సుమారు రూ.30లక్షలు వరకు కాజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో అమ్మ పాలడెయిరీ ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలిసి మహిళా సంఘాల నుంచి రూ.1.5కోట్లు వసూలు చేశారు. ప్రశాంతి జిల్లా సమాఖ్య పరిధిలో నడుస్తున్న జనరిక్ మందుల షాపు నుంచి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి అత్యంత వీరభక్తుడైన పశుసంవర్ధకశాఖకు చెందిన డాక్టర్ తులసిరామిరెడ్డిని ఏపీడీ స్థాయికి తీసుకువచ్చి అక్రమంగా వసూళ్లు చేశారు. స్త్రీనిధిలో ఉన్న మహిళల సొమ్మును ప్రభుత్వ కార్యక్రమాలకు రూ.30కోట్ల వరకు వాడేసుకున్నారు. పీడీ అవినీతి, అక్రమాలకు కళ్యాణదుర్గం ఏరియా కోఆర్డినేటర్, ఫైనాన్స్ డీపీఎం, హెచ్‌ఆర్ ఏపీఎంతో పాటు మరికొంతమంది డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలు పూర్తి స్థాయిలో సహకరిస్తూవచ్చారు. ఇక మహిళా యానిమేటర్లతో అసభ్యకరంగా ప్రవర్తించిన అప్పటి విడపనకల్లు ఏపీఎంను వైసీపీ నేతల ఒత్తిళ్ల మేరకు వెనకేసుకువచ్చారు. వైసీపీలో నేతలకు ఎన్నికల్లో ప్రచారం చేసిన ఉద్యోగులకు పని లేకుండా కూర్చోబెట్టి వేతనాలు చెల్లించారు. ఇవన్నీ మచ్చుకు మాత్రమే. ఇక జాబ్‌సెక్షన్‌కు సంబంధించిన కారును తమ ఇంటి సభ్యుల కార్యకలాపాలకు వాడుకోవడం, ఆఫీస్ అటెండర్లను తమ ఇంటి పనులకు వాడుకోవడం పుష్కలంగా జరిగిపోయాయి. ఇటీవల ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఉద్యోగుల బదిలీల పేరుతో సుమారు రూ.20లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలిసింది. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం పూర్తి స్థాయిలో లోతుగా విచారణ చేపడితే మరిన్ని అవినీతి, అక్రమాలు బయటపడే పరిస్థితులు ఉన్నాయి.

సిఫారసులకే ప్రాధాన్యం

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్వామాలో విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. వైఎస్సార్ జలకళ పథకంలో వేయని బోర్లకు రూ.10కోట్లకు పైగా నిధులు స్వాహా చేశారు. ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్లతో సుమారు రూ.30కోట్ల వరకు కూలీల బిల్లులను మెక్కేశారు. సామాజిక తనిఖీల పేరుతో ఓపెన్ ఫోరం ద్వారా, విజిలెన్స్ విభాగం ద్వారా రూ.5కోట్ల వరకు అధికారులు తమ జేబుల్లోకి వేసుకున్నారు. ఉదాహరణ...ముదిగుబ్బ మండలంలో ఉపాధి హామీ పథకంలో రూ.22 లక్షలు నిధులు దుర్వినియోగమైనప్పటికీ విజిలెన్స్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చి సిబ్బందిని కొనసాగించారు. బోగస్ మస్టర్లలో ఉపాధి హామీ సిబ్బంది, వైసీపీ నేతలు స్వాహా చేసిన నిధులను వాటాలుగా పంచుకోవడం గమనార్హం. ఇక బదిలీల విషయంలో టీఏ, ఈసీ, ఏపీఓ, ఏఈ, ఏపీడీల వరకు ఆయా స్థాయిలలో ముడుపులు పుచ్చుకోవడం పరిపాటిగా మార్చారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో తమకు అనుకూల ఉద్యోగులను బదిలీ చేసినట్లు సమాచారం. అయితే కొత్త అధికారులు ప్రక్షాళన చేయడంపైనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దీర్ఘకాలం ఒకే స్థానంలో....

ఆయన డీఆర్‌డీఏ-వైకేపీ పీడీగా 2019 సెప్టెంబరు 9న జిల్లాకు వచ్చారు. అంటే నాలుగు సంవత్సరాల 10 నెలలు కాలం పూర్తి కావస్తోంది. సీనియర్ అధికారులను సైతం పక్కనపెట్టి కేవలం వైసీపీ భజన, అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత జిల్లా కావడం, అదే సామాజికవర్గం కావడంతో హౌసింగ్ పీడీగా అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. అంతేగాక బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచారు. డ్వామా పీడీ 2020 సెప్టెంబరు 14న జిల్లాకు వచ్చారు. అంటే మూడున్నర సంవత్సరాలు (మూడు సంవత్సరాల 10 నెలలు కావస్తోంది). అయినా ఇక్కడ నుంచి కదిలించలేకపోయారు. ఎందు కంటే ఈ ఇద్దరు అధికారులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే... మరీ ముఖ్యంగా అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత ప్రీతిపాత్రులు కావడం, ఆయన సిఫారసుతోనే ఇక్కడ పార్టీకి మైలేజ్ పెంచేందుకు పనిచేస్తుండటం గమనార్హం. ఇక ఈ ఇద్దరి అధికారులకు అదే సామాజికవర్గానికి చెందిన ఓ కలెక్టర్ పుష్కలంగా సహకారం అందించిన సంగతి తెలిసిందే. ఇక ఆ కలెక్టర్‌పై ఎన్నికల కమిషన్ బదిలీవేటు వేసింది. ఈ క్రమంలోనే ఈ ఇద్దరి అధికారులను కూడా ఎన్నికల విధులకు దూరం పెట్టింది. నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆ ఇద్దరు అధికారులను బదిలీ చేస్తారా లేక వారిపై వేటు వేస్తారా అన్న చర్చ ఆయా కార్యాలయాల్లో జరుగుతోంది.


డీఆర్‌డీఏ పీడీగా ఈశ్వరయ్య



ఈశ్వరయ్య

వైసీపీ విధేయుడిగా ఆరోపణలున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన విషయం తెల్సిందే. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్యను పీడీగా నియమించి.. పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు పీడీగా పనిచేసిన నరసింహారెడ్డిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నాయి.

కొలువుల పండుగ



- డీఎస్సీ దిశగా వడివడిగా అడుగులు
- ఉమ్మడి జిల్లాలో 811 పోస్టుల భర్తీ...?
- స్కూల్ అసిస్టెంట్ 628, ఎస్‌జీటీ 183
- ఐదేళ్ల నైరాశ్యానికి తెరదించిన చంద్రబాబు
- దుమ్ము దులుపుకుంటున్న కోచింగ్ సెంటర్లు
- ఉరిమే ఉత్సాహంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు

అనంతపురం విద్య, జూన్ 25: లక్షలాది మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూసిన పండుగ రానే వచ్చింది. కొలువుల జాతర సిద్ధమవుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకుంటున్నారు. బాధ్యతలు తీసుకున్న రోజునే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. కూటమి ప్రభుత్వ కేబినెట్ తొలిసారి భేటీలోనే ఆమోదం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 811 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో 628 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 183 సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయి. డీఎస్సీ నేపథ్యంలో ఇన్నాళ్లూ మూతబడిన కోచింగ్ కేంద్రాలు దుమ్ము దులుపుకుంటున్నాయి. ఐదేళ్లపాటు తీవ్ర నైరాశ్యంలో ఉన్న నిరుద్యోగులు పోటీ పరీక్షకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.



డీఎస్సీకి శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

ఇదే కదా ఆనందం..



2019 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్‌ఏ-సోషల్ 5 పోస్టులు మాత్రమే ఇచ్చారు. తక్కువ పోస్టులను చూసి చాలా బాధేసింది. నిరాశ చెందాను. చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెద్ద సంఖ్యలో భర్తీ చేస్తుండటంతో ఆనందంగా ఉంది. జాబ్ సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.

- అభిషేక్, డీఎస్సీ అభ్యర్థి, అనంతపురం

నా కల నిజం అవుతుంది..



బీఈడీ పూర్తి టీచర్ ఉద్యోగాల కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాను. నోటిఫికేషన్లు రాకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లలో టీచర్‌గా పనిచేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయం కలగా మిగిలిపోతుందేమో అని బాధపడిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీకి వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ మెగా డీఎస్సీలో కచ్చితంగా పోస్టు సాధిస్తానన్న విశ్వాసం కలుగుతోంది. నా కల నిజమవుతుందని బలంగా నమ్ముతున్నాను. పేద విద్యార్థులకు సేవ చేసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను.

-రమ్య, డీఎస్సీ అభ్యర్థి, గుత్తి

జిల్లాలో ఖాళీలు ఇవే..?

వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 386 ఖాళీగా ఉన్నాయి. మొదట్లో ఎస్‌జీటీ పోస్టులు నాలుగు మాత్రమే చూపారు. దీంతో ఆగ్రహించిన నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చారు. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వం అరకొరగా పెంచింది. అయినా నిరుద్యోగుల్లో ఆనందం కనిపించలేదు. చంద్రబాబు అధికారం చేపట్టగానే భారీగా పోస్టుల భర్తీకి నడుం బిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలపైచిలుకు పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 811 పోస్టులు భర్తీ చేస్తారని విస్వసనీయంగా తెలిసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్ కేటగిరీల వారీగా చూస్తే...

కేటగిరీ	పోస్టుల సంఖ్య
ఎస్‌ఏ-(తెలుగు)	45
ఎస్‌ఏ- హిందీ	35
ఎస్‌ఏ- ఇంగ్లీష్	103
ఎస్‌ఏ-గణితం	44
ఎస్‌ఏ-పీఎస్	68
ఎస్‌ఏ-బీఎస్	73
ఎస్‌ఏ-సోషల్	112
ఎస్‌ఏ-ఫిజికల్ ఎడ్యుకేషన్	148
ఎస్‌జీటీ	183
----------	------
మొత్తం	811
----------	-------

ఐదేళ్ల నైరాశ్యం నుంచి..

మోడువారిన ఆశల మోసులకు చంద్రబాబు నీరు పోసి.. చిగురింపజేశారు. కొలువు కొట్టాల ఆశతో నిరుద్యోగులు ఐదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. 2019లో సీఎం పీఠమెక్కిన జగన్.. నిరుద్యోగులను నిలువునా ముంచారు. వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. అదిగో ఇదిగో అంటూ ఊరించి.. ఎన్నికల సమయంలో డీఎస్సీ అంటూ మోసగించాలని చూశారు. కానీ నిరుద్యోగులు నమ్మలేదు. 2024 జూన్ 3వ తేదీ వరకూ నిరుద్యోగులు నైరాశ్యంలోనే ఉన్నారు. ఆ మరుసటి రోజు ఎన్నికల ఫలితాలు రాగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

పోస్టులు పెరిగే చాన్స్

జగన్ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను నాశనం చేసింది. వేలాది ఎస్‌జీటీ పోస్టులను రద్దు చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్దుతుందని, తమ సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ క్రమంలో 117 జీవో రద్దు చేయాలని ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. 117 జీవోను రద్దు చేస్తే ఎస్‌జీటీ పోస్టులు పెరుగుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మళ్లీ మంచి రోజులు

జగన్ దెబ్బకు జిల్లాలో పలు కోచింగ్ కేంద్రాలు మూతపడ్డాయి. నిపుణులైన నిరుద్యోగులు కోచింగ్ కేంద్రాలు పెట్టుకుని ఉపాధి పొందేవారు. గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా, అడపా దడపా పోస్టులు భర్తీ చేసేవారు. దీంతో పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తూ జీవనం గడిపేవారు. ముఖ్యంగా డీఎస్సీ కోచింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉండేది. వేలాది మంది శిక్షణకు రావడమే దీనికి కారణం. జిల్లాలో ఉన్న పేరు మోసిన కోచింగ్ సెంటర్లతోపాటు చిన్న తరహా కోచింగ్ కేంద్రాలు సుమారు 15 వరకూ నడిచేవి. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక వారికి గడ్డుకాలం మొదలైంది. డీఎస్సీ లేదు, జాబ్ క్యాలెండ్ లేదు. ఒకప్పుడు కిటకిటలాడిన కేంద్రాలు మూతపడ్డాయి. ఏడాదికి రూ.50 లక్షలు, రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకూ సాగే బిజినెస్ కోల్పోయారు. కొందరు నిర్వాహకులు అప్పులపాలయ్యామని వాపోతున్నారు. జగన్ ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో సుమారు ఆరు శిక్షణా కేంద్రాలు మూసేశారు. లక్షలాది రూపాయల అద్దె చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చంద్రబాబు సీఎం కావడంతో తమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు రాకతోనే..



జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ అందరినీ ముంచేసింది. నిరుద్యోగులను భయాందోళనలకు గురిచేసింది. జగన్ వారిలో అభద్రతాభావాన్ని పెంచారు. డీఎస్సీ ప్రకటనపై రోజుకొక మాట చెబుతూ మాయలు చేశాడు. ఆఖరికి కోచింగ్ సెంటర్లు కూడా మూత పడేలా చేశారు. లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలను ఆవిరి చేశారు. ఎన్నికల ముందు లక్షలాది మంది నిరుద్యోగులకు చంద్రబాబు మాట ఇచ్చారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- గుత్తా ధనుంజయనాయుడు, టీఎన్ఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షుడు

అభ్యర్థుల్లో ఆనందం..



గత ఐదేళ్లలో డీఎస్సీ ప్రకటన లేక వేలాది మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటన ఇవ్వడంతో నిరుద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. కేబినెట్‌లో కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం.. పోస్టులు రెట్టింపు కావడంతో డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- తేజ, తేజ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

కసాపురం ఆలయ హుండీ ఆదాయం రూ. 81.27లక్షలు

గుంతకల్లుటౌన్,జూన్25: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో 89 రోజులకు గాను హుండీలను లెక్కించారు. రూ.81,27,202, అన్నప్రసాదం వితరణ హుండీ రూ. 74,790, 11.500గ్రాముల బంగారం, 2.800కేజీ వెండి, విదేశీ కరెన్సీలు వచ్చాయని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మల్లికార్జున, జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆంధ్రప్రగతి బ్యాంక్ సిబ్బంది, పోలీస్, ఆర్టీసీ సేవాసమితి, వీరభద్ర సేవాసమితి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ సొమ్మును లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

8 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణాతరగతులు

అనంతపురం విద్య, జూన్ 25 : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శిక్షణా తరగతులు జూలై 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వచ్చే నెల 8,9,10 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి విద్యార్థులకు తరగతులు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నేతలు హనుమంతు, నరసింహ, వెంకట్, ఆంజినేయులు, వంశీ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు మంత్రి సవిత రాక

పెనుకొండ టౌన్, జూన్ 25 : రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత బుధవారం శ్రీ సత్యసాయి జిల్లాకు రానున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మంగళవారం రాత్రి 8గంటలకు విజయవాడలో బయలుదేరి 10.30 గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెనుకొండలోని స్వగృహానికి చేరుకుంటారు. అనంతరం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

పాఠశాల వాహనానికి ప్రమాదం

- తృటిలో తప్పించుకున్న 25 మంది విద్యార్థులు

బొమ్మనహాళ్, జూన్ 25: మండలంలోని ఉంతకల్లు గ్రామ సమీపంలో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. ఒక ప్రైవేట్ పాఠశాల వాహనం పంట కాలువలోకి దూసుకెళ్లడంతో విద్యార్థులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఉంతకల్లు గ్రామానికి విద్యార్థులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే ఉద్దేహాళ్ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. వీరిని పాఠశాలకు చెందిన వాహనం రోజు పాఠశాలకు తీసుకువచ్చి, వదిలేది. ఈక్రమంలోనే మంగళవారం కూడా పాఠశాలకు చెందిన కేఏ 36 బి 4237 నంబర్ గల వాహనం విద్యార్థులను తీసుకువచ్చింది. స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం పిల్లలను వదిలి వెళ్లడానికి బయల్దేరేరింది. డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తతో వేగంగా నడపడంతో పంటకాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో దాదాపు 25 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రైవేట్ పాఠశాలకు చెందిన వాహనం ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారని, గతంలో కొళగానహళ్లి వద్ద కూడా ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.



పంట కాలువలోకి దూసుకెళ్లిన వాహనం

ఆధునికీకరణ సాగేనా..?

- ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగని హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు
- సాగునీటి ప్రాజెక్టులపై నిండా నిర్లక్ష్యం
- రైతుల ఆశలన్నీ టీడీపీ ప్రభుత్వంపైనే..
- మరమ్మతులతో అడుగడుగునా అడ్డు
- చివరి ఆయకట్టు భూములకు పారని నీరు



14వ కి.మీ. అక్విడెక్ట్‌పై పడిన రంధ్రం



హెచ్చెల్సీలో పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిక



ఉరవకొండ, జూన్ 25: ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటిపై నిండా నిర్లక్ష్యమే నెలకొంది. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలోనైనా సాగు నీటి ప్రాజెక్టులు ముందుకు సాగేనా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో హెచ్చెల్సీ, జీబీసీ పనులు కాసింతైనా ముందుకు కదలలేదు. కనీసం తట్టెడు మట్టికూడా తీయలేకపోయారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారయ్యాయి. కాలువ గట్లు భారీగా కోతకు గురయ్యాయి. కాలువల్లో పూడిక పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడమే ప్రశ్నార్థకంగా తయారయ్యింది. కాలువల్లో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క, పెరిగిపోయాయి. హెచ్చెల్సీ 6వ ప్యాకేజీలో 183వ కి.మీ నుంచి 189కి.మీ వరకు పనులు నిలిచిపోయాయి. ఇంద్రావతి డీప్ కట్ వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర ఎగువ కాలువ గట్టు కోతకు గురయ్యింది. నింబగల్లు ఎగువ ప్రాంతాల్లో వర్షం కారణంగా వరదనీరు, వర్షపునీరు కాలువగట్లు మట్టి కొట్టుకు రావడంతో నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది.

షెట్టర్ల పరిస్థితి ఘోరం

ఇక హెచ్చెల్సీ కాలువ షెట్టర్ల పరిస్థితి కూడా ఘోరంగా తయారయ్యింది. షెట్టర్లకు ఉన్న రాళ్లు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆధునికీకరణ పనుల్లో వీటి నిర్మించాల్సి ఉంది. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. మరమ్మతుల కోసం రూ.48లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తే నీరు పారే అవకాశముంది. ఇంద్రావతి వద్ద డీప్‌కట్‌లో అడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని షెట్టర్లను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న హెచ్చెల్సీ షెట్టర్లు




14వ కి.మీ. వద్ద జీబీసీ దుస్థితి

అడుగడుగునా అవాంతరాలే..

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) కింద చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన కాలువలో అక్విడెక్టులు, అండర్ టన్నెళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు మరిచారు. దీంతో నీరు అంతా వృథాగా పోతోంది. ప్రధాన కాలువ పొడవు 59.5 కిలో మీటర్లు కాగా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద 15,800 ఎకరాల ఆయకట్టు ఉంది. 2017 గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఫేజ్-1 కింద 1కి.మీ నుంచి 28 కి.మీ వరకూ రూ.120 కోట్లతో పనులను చేపట్టారు. కాలువ లైనింగ్ పనులను మాత్రమే చేశారు. డిస్ట్రిబ్యూటర్లు ప్రధానకాలువ కంటే ఎత్తులో ఉండటంతో వాటికి అడ్డుకట్ట వేస్తే కానీ నీరు వెళ్లని పరిస్థితులున్నాయి. అక్విడెక్టులు అండర్ టన్నెల్ పనులను విస్మరించారు. 28వ కి.మీ నుంచి 59.5కి.మీ వరకూ రూ.117.2కోట్లతో పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. పనులు సగంలోనే నిలిచిపోయి నాలుగేళ్లు అవుతుంది. 15వ కి.మీ అక్విడెక్ట్‌కు రంధ్రాలు ఏర్పడి నీటి సరఫరాకు అవాంతరం ఏర్పడింది. కాలువలో పిచ్చిమొక్కలు, పూడిక పేరుకు పోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు కలుగుతున్నాయి. ఛాయాపురం నుంచి చివరి వరకూ ప్రధానకాలువలో పిచ్చిమొక్కలు రబ్బరు చెట్లు పెరిగాయి. తిమ్మాపురం అంచనహాల్ గ్రామాల వద్ద కూడా కాలువ లైనింగ్ దెబ్బతినింది. జీబీసీకి అరకొరగానే నీటి కేటాయింపులు. జీబీసీ, జీఎస్‌బీసీ, ఏబీసీ కాలువకు 6.89 టీఎంసీల నీరు ఇవ్వాల్సి ఉండగా జీబీసీ పనులు జరగకపోవడంతో నీటి కేటాయింపులు కూడా తగ్గుతున్నాయి.

సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- మనోహర్, ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి



ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు నిలిచిపోవడంతో కాలువ అధ్వానంగా తయారైంది. కాలువ గట్లు కోతకు గురయ్యాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి నీరు పారేది గగనంగా తయారైంది.

మోటార్లతో నీటిని వదులుకోవాల్సి వస్తోంది


- గోవిందరాజు, రైతు, ఉండబండ



డిస్ట్రిబ్యూటరిలోని తూములకు నీళ్లు అందక మోటర్లతో పంపు చేసుకుని, సాగుకు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తూము ఎత్తులో ఉండడంతో నీరు అందడం లేదు. కాలువలో రాళ్లను అడ్డువేసుకుని తూములకు మళ్లించుకోవాల్సి వస్తోంది. ఆధునికీకరణ పనులు చేపట్టినా ఏం ప్రయోజనం లేదు.

చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు

- లింగప్ప, రైతు, డొనేకల్లు



జీబీసీ కాలువ పరిధిలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందడం లేదు. ఆయకట్టు భూములను బీడుగా వదులుకోవాల్సి వస్తోంది. జీబీసీ ఫేస్-2 క్రింద ఆధునీకరణ పనులు నిలిచిపోయాయి. వెంటనే పనులు పూర్తి చేయాలి. కొత్త ప్రభుత్వమైనా సాగు నీటి ప్రాజెక్టులపైన శ్రద్ధ చూపాలి. చివరి ఆయకట్టుకు నీరందించి రైతును ఆదుకోవాలి.

రాష్ట్రస్థాయి పోటీలకు కొడిగెనహళ్ళి విద్యార్థులు

హిందూపురం అర్బన్, జూన్ 25: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబు తెలిపారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కొడిగెనహళ్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఇందులో ఎనిమిదో తరగతి విద్యార్థి రితీష్‌కుమార్ వంద మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, ఏడో తరగతి విద్యార్థి సాంబశివ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నారన్నారు. విద్యార్థులు త్వరలో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పిఈటీ షబానాబాను, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

చీనీకాయలు టన్ను రూ.31 వేలు

అనంతపురంరూరల్, జూన్ 25: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.31 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 704 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సంక్షిప్తంగా..

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చెన్నేకొత్తపల్లి, జూన్ 25: వాతావరణం మార్పుల వల్ల సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడాపురం ప్రభుత్వ యూనాని ఆసత్రి వైద్యుడు ఖాదర్ పేర్కొన్నారు. మంగళవారం మేడాపురంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేకపోతే దోమలు వృద్ధి చెంది అనేక రోగాలు బారిన పడాల్సి వస్తుందని అన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. ఎవరికైన జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

శింగనమల : గ్రామాల్లో సీజనల్ వాధ్యులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ సుమన జయంతి మంగళవారం అవగాహన కల్పించారు. అతిసారా వ్యాధి నియంత్రణ, నిర్మూలనపై ఏఎన్‌ఎంఎస్, ఎంఎల్ హెచ్‌పీఎస్‌లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి వెంకటరమణ, ఎంఈఓ నరసింహరాజు సీహెచ్‌ఓ గంగాధర్, ఏఎ‌ప్‌ఎంలు, ఆశాలు మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2

చెన్నేకొత్తపల్లి, జూన్ 25: మండలంలోని హరియన్‌చెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం తప్పకుండా భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

మండల సమాఖ్య సమావేశం

శింగనమల,జూన్ 25: స్థానిక సమాఖ్య భవనంలో మండల సమావేశాన్ని ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం నిర్వహించారు. మహిళ సంఘాల ద్వారా మహిళలు తక్కువ వడ్డీతోనే రుణాలు తీసుకొని చిన్నచిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో సమాఖ్య అజెండాపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మురళీకృష్ణ, ఏపీఎం నారాయణస్వామి, సీసీలు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

శింగనమల, జూన్ 25: శింగనమల చెరువులో మత్స్యకారులు గంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు 'సందర్భం.. సమాలోచన' సదస్సు

అనంతపురం కల్చరల్, జూన్ 25 : జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు క్లాక్‌టవర్ సమీపంలో జేవీవీ జిల్లా కార్యాలయంలో 'సందర్భం సమాలోచన' సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు సమన్వయకర్తలు సతీష్, సూర్యచంద్ర మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఎలా..? అనే అంశంపై ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. సాహితీకారులు, మేధావులు విరివిగా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 25: జిల్లాలోని ఆర్బీకేల్లో 26వ రోజైన మంగళవారమూ విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 83,013 మంది రైతులకు 74,232 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 84,754 మంది రైతులు 74,785 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

28న ప్రాంగణ నియామకాలు

అనంతపురం సెంట్రల్ : ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చివరి సంవత్సరం విద్యార్థులకు, ఇదివరకు ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమర్జెన్సీ డే.. ఓ చీకటిరోజు

అనంతపురం సెంట్రల్ : కాంగ్రెస్ పార్టీ 1975లో విధించిన ఎమర్జెన్సీ డే ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎమర్జెన్సీపై అప్పట్లో గళం విప్పిన ప్రతి ఒక్కరినీ చిత్రహింసలకు గురిచేసి.. కారాగారంలో బంధించారన్నారు. అనంతరం ఎమర్జెన్సీలో అరెస్ట్ అయిన రమేష్, బద్రినాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్, అశోక్‌రెడ్డి, గొంది అశోక్‌కుమార్, కుమారి, రంజిత్ నాయక్, ప్రభుకుమార్, చిరంజీవి, తరుణ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు



సంకష్టహర వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు



అలంకరణలో గణనాథుడు

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు

అనంతపురం కల్చరల్, జూన్ 25: జ్యేష్ఠమాస సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు ఆలయాల్లో పూజాది కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో జెడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిరంలో, మూడో రోడ్డులోని షిరిడి సాయిబాబా దేవాలయంలో గణనాథుని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సంకష్టహర వ్రతాలను ఆచరించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలో పాల్గొన్న భక్తులు

ఆర్ట్స్ కళాశాలలో సీఎం చంద్రబాబు ఫొటో ఏర్పాటు



ప్రిన్సిపాల్‌కు సీఎం చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 25: అనంత పురం ఆర్ట్స్ కళాశాలలో సీఎం చంద్రబాబు నాయుడు ఫొటోను టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఏర్పాటు చే యించారు. టీడీపీ అధి కారంలోకి రావడంతోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసినా ఇప్పటి దాకా ఆర్ట్స్ కళాశాలలో సీఎం చంద్రబాబునాయుడు ఫొటో పెట్టలేదు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మంగళవారం అక్కడి వెళ్లారు. టీడీపీ నాయకులు గోపాల్ గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అమర్ యాదవ్, సతీష్, అభిరామ్, శివుడు, భరత్, పార్థు, విజయ్‌బాబు, రామ్మోహన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డికి సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఆ ఫొటోను ఏర్పాటు చేయించారు.

టీడీపీ కార్యకర్తల పొలాల్లో వ్యవసాయ పరికరాలు ధ్వంసం

రాప్తాడు, జూన్ 25: మండలంలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన అమిలినేని చంద్రయ్య కుమారులు అమిలినేని వెంకటనాయుడు, అమిలినేని మహేంద్ర పొలాల్లోని వ్యవసాయ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వెంకటనాయుడు, మహేంద్ర మూడేళ్ల క్రితం పొలంలో బోర్లు వేయించి పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లోని గేటు వాల్వులు, ఫిల్టర్లు, డ్రమ్ములు, పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు ధ్వంసం చేశారు. పెద్ద పెద్ద రాళ్లతో వ్యవసాయ పరికరాలపై వేయడంతో అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. రైతులు మంగళవారం ఉదయం పొలంలోకి వెళ్లగా వ్యవసాయ పరికరాలు ధ్వంసమై ఉండటాన్ని గుర్తించారు. దీనిపై బాధితులు వెంకటనాయుడు, మహేంద్ర రాప్తాడు సీఐ మునిస్వామికి ఫిర్యాదు చేశారు. తమకు రూ. 80 వేలు నష్టం వాటిల్లిందని సీఐ వద్ద వాపోయారు.



ధ్వంసమైన వ్యసాయ పరికరాలు

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

అనంతపురం అర్బన్, జూన్ 25: తమ సమస్యలు పరిష్కరించాలని అనంతపురం నగర పాలక సంస్థ కార్మికులు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని, ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించేలా చొరవ చూపాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ... మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సీఎం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిరంజీవి, నాగరాజు, వేణుగోపాల్, శివకృష్ణ, కుళ్లాయిరెడ్డి, ఎర్రప్ప, అసేన్, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుదాం: ఆర్ఎం



మాట్లాడుతున్న ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని

అనంతపురం కల్చరల్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఇంధన పొదుపు మెలకువలను పాటించి, ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు సమ ష్టి కృషి చేద్దామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో డ్రైవర్లకు ఇంధన పొదుపు, ప్రమాదాల నివారణపై ఏర్పాటు చేసిన వారంరోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ డీజిల్ ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో డీజిల్ వృథా అవకుండా పొదుపు పాటించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో డిప్యూటి సీటీఎం రమేష్‌బాబు, ఎస్ఎండీ హనీఫ్, అనంతపురం డీఎం నాగభూ పాల్, అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణస్వామి, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలను తగ్గించాలి

అనంతపురం కల్చరల్, జూన్ 25: ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా పాలన చేస్తున్నప్పటికీ నిత్యావసర ధరలను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రైతుల కోరిక మేరకు ప్రతి పంటకు రేటును పంట పెట్టే ముందే ప్రభుత్వం నిర్ణయించాలని, అప్పుడే రైతులకు, కొనుగోలు దారులకు లాభం చేకూరుతుం దన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లు, గోడౌన్‌లలో వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను బయటకు తీసి, రైతు బజార్లలో ప్రభుత్వమే తక్కువ ధరలకు విక్రయించాలని కోరారు. బ్లాక్ మార్కెట్లలో అమ్ము తున్న వ్యాపారులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ నాయకులు వెంకటనారాయణ, ప్రకష్, వలి, బాలకృష్ణ, మసూద్, సీనా, ఎర్రిస్వామి, నూరుల్లా, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

పుట్టపర్తిరూరల్/ చెన్నేకొత్తపల్లి జూన్ 25: చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని పలువురు ఏఎన్ఎంలు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తిలోని జిల్లా వైద్యాధికారి మంజువాణికి ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా లైంగికంగా వేధిస్తున్నాడని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నాడని వాపోయారు. తమతోపాటు తమ పిల్లలను కూడా లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. జిల్లా వైద్యాధికారి స్పందిస్తూ.. దీనిపై కమిటీ వేసి, విచారణ చేపడతామని, వాస్తవమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఏఎన్ఎంలు

కాలనీలో హైటెన్షన్

ఇళ్లపై తక్కువ ఎత్తులో 11 కేవీ విద్యుత్ తీగలు

భయాందోళనల్లో కళాకారుల కాలనీ వాసులు

రాప్తాడు, జూన్ 25: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధి కళాకారుల కాలనీలో ఇళ్లపై 11 కేవీ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రభుత్వ టిడ్కో ఇళ్ల పక్కన కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండటంతో ఇళ్లు నిర్మించుకునేవారు భయాందోళనకు గురవుతున్నారు. నిర్మాణ పనులు చేపట్టే సమయంలో ప్రమాదవశాత్తు ఆ తీగలు తగిలితే క్షణాల్లో ప్రాణాలు పోయే ప్రమాదముంది. కొన్నేళ్ల క్రితం కళాకారుల కాలనీలో ఇళ్లు ఉండేవి కావు. ఆ ప్రాంతమంతా ముళ్ల కంపలు ఉండేవి. ఈ సమయంలో విద్యుత్ అధికారులు ఒక చోట నుంచి మరొక చోటకు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగారు. కాలక్రమేణా ఆ ప్రాంతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. పట్టాలు పొందిన పేదలు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడం ప్రారంభించారు. ప్రస్తు తం 11 కేవీ విద్యుత్ తీగల కింద ప్రదేశంలో ఇళ్ల పట్టాలు ఉన్న వారు కొంతమంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దాదాపు పది మంది ఇళ్లపైన తక్కువ ఎత్తులోనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఆ విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలంటే విద్యుత్‌శాఖకు డబ్బు చెల్లించాల్సి ఉంటుందని అనంతపురం విద్యుత్ కార్యాల యం డీఈ అంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఆ తీగలను మరింత ఎత్తు అయినా పెంచాలని, లేదా మరో ప్రాంతం ద్వారానైనా తీగలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



ఇళ్లపై తక్కువ ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు

స్తంభాలు పక్కకు మార్చాలి



మా ఇంటి పైన 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లు నిర్మించే సమయంలో పనులు చేసే వారు చాలా భయంగా పని చేయాల్సి వస్తోంది. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను మరో చోట ఏర్పాటు చేసి.. ఈ సమస్యను పరిష్కరించాలి.

-శివరామకృష్ణ, కళాకారుల కాలనీ

తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి



ప్రభుత్వం మాకు ఇంటి పట్టా పంపిణీ చేసిన స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇంటిపై మరో ఫ్లోర్ నిర్మించుకోవాలంటే 11 కేవీ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. అందువల్ల అదనపు ఫ్లోర్ పనులు చేయించలేకపోతున్నాం. ఏ ప్రమాదం జరిగి.. ప్రాణ నష్టం జరగక ముందే.. విద్యుత్ తీగల ఎత్తు పెంచాలి.. లేదంటే తీగలు ఇబ్బంది లేని ప్రదేశానికి అయినా మార్చాలి.

- జ్యోతి, కళాకారుల కాలనీ



దాబాలో తనిఖీలు చేస్తున్న అధికారిణి తస్లీం, పెరుగు పచ్చడిలో పడిన ఈగలు

లైసెన్స్ లేకుండా దాబా నిర్వహణ

● తనిఖీకి వెళ్లిన ఫుడ్ సేఫ్టీ అధికారిణిపై నిర్వాహకుడి దుర్భాషలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 25: తనిఖీకి వెళ్లిన ఫుడ్‌సేఫ్టీ అధికారిణిపై దాబా నిర్వాహకుడు దుర్భాషలాడిన సంఘటన గుత్తి మండలం కరిడికొండ గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. కరిడికొండ గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారికి పక్కనే రాయల్ దాబాను దాదాపు 20 ఏళ్లుగా ఎలాంటి లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్నారు. అక్కడ నాణ్యత లేని ఆహార పదార్థాలు ప్రజలకు అంటగడుతున్నట్లు ఓ వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీం దాబా తనిఖీకి వెళ్లారు. అయితే ఆమె దాబా నిర్వాహకుడు రాముతో పాటు అక్కడ ఉన్న వ్యక్తులు తమ దాబాలోనే ఎందుకు పరిశీలిస్తున్నారని, మీ అంతు చూస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చారని సమాచారం తెలుసుకున్న మీడియా సిబ్బంది అక్కడికి వెళ్లగా వారిపైన కూడా దురుసుగా ప్రవర్తించాడు. ఫ్రిడ్జ్‌లో కొన్ని రోజుల నుంచి నిల్వ ఉంచిన మసాలాలతో పాటు ఉడికించిన మాంసాన్ని అందులో ఉంచారు. పెరుగులో కూడా ఈగలు పడి చనిపోయాయి. పెరుగును ఫ్రిడ్జ్‌లో ఉంచారని, గడువు తీరిన సోయాసాసులను అధికస్థాయిలో కలర్లను వాడుతున్నట్లు అధికారిణి గుర్తించారు. స్టోర్ రూమ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల మసాలాలను ఉంచారని తెలిపారు. వీటన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీం తెలిపారు.

మొక్కు తీర్చిన టీడీపీ అభిమాని



సల్లాపురమ్మ, ముత్యాలమ్మను ఊరేగిస్తున్న గ్రామస్థులు

రాప్తాడు, జూన్ 25: ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పరిటాల సునీత రాప్తాడు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరం చేస్తే గ్రామ దేవతలు సల్లాపురమ్మ, ముత్యాలమ్మను గ్రామ వీధుల్లో ఊరేగిస్తానని బండమీదపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దాసరి మల్లి ఆ దేవతలకు మొక్కుకున్నాడు. తన కోరిక నెరవేరడంతో ఆ టీడీపీ కార్యకర్త మంగళవారం సాయంత్రం గ్రామ దేవతలను పూల హారాలతో అలంకరించి పుర వీధుల్లో వైభవంగా ఊరేగించాడు. గ్రామస్థులు టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

కుర్లపల్లయ్యస్వామి ఊరేగింపు



రాప్తాడులో ఊరేగిస్తున్న కుర్లపల్లయ్యస్వామి కాపులు

రాప్తాడులో మంగళవారం సాయంత్రం కుర్లపల్లయ్యస్వామిని వైభవంగా ఊరేగించారు. ధర్మపురి గ్రామంలో వెలసిన కుర్లపల్లయ్యస్వామిని కురుబ కులానికి చెందిన పామాల వంశస్థులు రాప్తాడుకు తీసుకుని వచ్చి ఊరేగించారు. సోమవారం రాత్రి, మంగళవారం గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అభివృద్ధి చేసిన వారి పేర్లను ఎలా తొలగిస్తారు?



నీటి సంపు వద్ద టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, జూన్ 25: వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని, పైగా టీడీపీ హయంలో చేసిన అభివృద్ధి పనులపై ఆ పార్టీ నాయకుల పేర్లను వారు తొలగించడం వారి సైకో తత్వానికి నిదర్శనమని మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ ధ్వజమెత్తారు. మండలంలోని కక్కలపల్లి కాలనీలో టీడీపీ హయంలో సత్యసాయి నీటి సంపును నిర్మించి నీటిని సరఫరా చేసింది. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఆ సంపు పై ఉన్న నాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత పేరును తొలగించారు. మళ్లీ ఇప్పుడు చల్లా జయకృష్ణ, గ్రామ మాజీ సర్పంచు సుశీలమ్మ ప్రకాష్ సంపునకు రంగులు కొట్టించి.. గతంలో ఉన్న విధంగా పేర్లు రాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు అభివృద్ధి చేయకుండా.. టీడీపీ వాళ్ల పేర్ల తొలగించి కేవలం సునకానందం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నాభూషణచౌదరి, మనోహర్‌నాయుడు, ఈడిగ సూరి, బోయ భాస్కర్, నాగేంద్ర, గుజిరి, అక్బర్, ప్రసాద్, రాజు, రామాంజి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

అనంతపురం కల్చరల్, జూన్ 25: పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ కార్యాలయం వద్ద మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. పిరమిడ్ ధ్యానయోగ గురువు హనుమంతు హాజరై ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం సంస్థ సభ్యులు హనుమంతు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి మాట్లాడుతూ... కరోనా సమయంలో ప్రజలు డబ్బులు వెచ్చించినా ఆక్సిజన్ లభించక వేలాది మంది మృత్యువాత పడ్డారని, పచ్చని చెట్లు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఆక్సిజన్ సమృద్ధిగా ఉండడం వల్ల ప్రాణనష్టం తక్కువగా జరిగిందని అన్నారు. ఇలా ఆక్సిజన్ కొరతకు మరోసారి ఆస్కారం రానివ్వకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమం లో సంస్థ కార్యదర్శులు మస్తానప్ప, లక్ష్మీదేవి, మురళికృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా డీఎస్సీ మెటీరియల్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 25: ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న వాల్మీకి-బోయ అభ్యర్థులకు మోడల్ టెస్ట్‌తో పాటు ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికుమార్ పవన్‌కుమార్ తెలిపారు. 2023-24లో డీఈడీ, బీఈడీలో ఉత్తీర్ణత పొందిన వాల్మీకి నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 30లోపు వివరాలు అందజేయాలన్నారు. వివరాలకు 9440774519, 8309090406 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్యాధికారులు



ఆసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ,జూన్ 25: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న వారిని ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వో సుజాత, డీపీఎంవో రవికుమార్ పరామర్శించారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో పీపీ యూనిట్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. డయేరియా లక్షణాలు కనిపిస్తున్న గ్రామాల్లో సర్వే చేయాలని, అనుమానిత కేసులను గుర్తించాలన్నారు. అనంతరం షేక్షానుపల్లి, రాచర్ల గ్రామాల్లో సర్యటించారు. తాగునీటి పథకాల వనరులను పరిశీలించారు. మండలంలోని మోపిడి గ్రామంలో డయేరియా కేసులు నమోదవుతుండటంతో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ట్యాంకులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లోజీ, వైద్యులు గంగాధర్, సాహితీ, వినీత, సూపర్‌వైజర్ నాగరంగయ్య, ఈవోపీఆర్డీ చంద్రమౌళి, సూపర్‌వైజర్ శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ఎర్రితాత ఉత్సవాలు



ఎర్రితాతకు చత్రప్రభ అలంకరణలో పూజలు

బెళుగుప్ప, జూన్ 25: మండల కేంద్రంలో అవదూత ఎర్రితాతస్వామి 88వ ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. కన్నుల పండువగా ఉట్ల పరుష నిర్వహించారు. బెళుగుప్పతో పాటు ఇతర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించారు. చివరి రోజు స్వామికి అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం చత్రప్రభ అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

తాగునీటి కోసం ఆందోళన



అధికారులను నిలదీస్తున్న మహిళలు

ఉరవకొండ,జూన్25: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఇందిరానగర్ కాలనీవాసులు తాగునీటి కోసం మంగళవారం ఆందోళన చేశారు. కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. నెల రోజులుగా తాగు నీరు సరఫరా చేయలేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిందె నీరు కొనాలంటే రూ.15లు చెల్లించాల్సి వస్తోందని తక్షణమే నీటిని విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నీటి సరఫరాపై హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఎమర్జెన్సీ వ్యతిరేకులకు సన్మానం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్

తాడిపత్రిటౌన్, జూన్25: స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పని చేసిన వారిని సన్మానించారు. ఇందులో భాగంగా బీజేపీ సీనియర్ నాయకులు శ్రీరంగయ్యను సన్మానించినట్లు రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975జూన్ 25న అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యం గొంతుకను నొక్కారన్నారు. దీనిపై ప్రజా ఉద్యమం చెలరేగి 1977లో ఎన్నికలు జరగడానికి దోహదం చేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అప్పట్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి సన్మానం చేసినట్లు తెలిపారు.

బాలలు ఉండాల్సింది బడిలోనే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

యాడికి, జూన్25: బాలలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అని ఎంఈఓ-2 ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం యాడికిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమంపై వివిధశాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14సంవత్సరాలలోపు పిల్లలందరూ బడిలో ఉండేలా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలందరిని విధిగా బడిలో చేర్పించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపించేలా చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ-1 కాశప్ప, ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, ఏపీఎం చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ దేవకుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం

బెళుగుప్ప, జూన్ 24: పశుసంవర్ధక శాఖ పథకాలను సద్వినియోగం చేసుకుంటే ఎంతో లబ్ధి కలుగుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సుబ్రహ్మణ్యం రైతులకు సూచించారు. మండలంలోని గంగవరంలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి పాల్గొని రాయితీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు వెంకటేష్, అధికారులు సుధాకర్, డాక్టర్ రమేష్ బాబులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను పూర్తి చేస్తా

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్ 25: పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో అర్థంతరంగా నిలిచిపోయిన అంబేడ్కర్ భవన్‌కు నిధులు కేటాయించి పూర్తి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అంబేడ్కర్ భవన్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. టీడీపీ హయాంలో ప్రారంభమైన ఈ కమ్యూనిటీ భవనాన్ని పూర్తిచేయడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటానని, కాలనీలో స్థలాలకు పట్టాలు లేని వారికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. అనంతరం ఈ భవన స్థలంలో మొక్కలు నాటారు. మాజీ కౌన్సిలరు కత్తి నాగయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంపూర్ణ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, ఆర్ పవన్‌కుమార్ గౌడు, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, యూ ప్రభాకర్, చికెన్ జగన్, దస్తప్ బాషా, చిప్పగిరి ప్రతాప్, రాయల రామయ్య, బండారు రామన్న, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, బీఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పనులను వేగవంతం చేయండి



112 కి.మీ. వద్ద పనులను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఈఈ, డీఈలు

బొమ్మనహాళ్, జూన్ 25: మండలంలోని ఉంతకల్లు, ఉద్దేహాళ్ గ్రామాల సమీపం హెచ్చెల్సీలో అత్యవసర పనులను వేగవంతం చేయాలని ఈఈ రమణారెడ్డి అన్నారు. మంగళవారం కాలువ 119, 112 కి.మీ. వద్ద దెబ్బతిన్న యూటీ చానళ్లు, గండిపడిన కాలువ గట్టు ప్రాంతాలను పరిశీలించారు. అత్యవసర మరమ్మతు పనుల కింద రూ. 50 లక్షల నిధుల మంజూరుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో నీరు వస్తే పనులు చేయడానికి ఇబ్బంది కలుగుతుందని, అందుకే ముందస్తుగా యూటీ అండర్‌టన్నెల్ చానల్ కాలువ, గట్టుకు పడిన గండి పనులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 181 కి.మీ. వద్ద ఇంకా పనులు ప్రారంభం కాలేదని, ఒకటి రెండురోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ మద్దిలేటి, జేఈ అల్తాఫ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్యసిబ్బంది

బొమ్మనహాళ్, జూన్ 25: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని బొమ్మనహాళ్ ఈఓపీఆర్డీ దాస్, శ్రీధరఘట్ట వైద్యాధికారులు కుమారరాజా, గీతా భార్గవి అన్నారు. మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు శివన్న, లోకేష్, సూపర్‌వైజర్లు ఉమాదేవి, విజయభారతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

కుందుర్పి: డయేరియా పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నియంత్రణపై రెవెన్యూ, వైద్య ఐసీడీఎస్ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా కట్టడిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనూష దేవి డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి, ఈవోఆర్డీ రఘురామ్, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన సదస్సు

గుమ్మఘట్ట: గ్రామాలలో డయేరియా వ్యాధి నిర్మూలనపై వైద్యాధికారులు మంగళవారం మండల కేంద్రంలోని ఓ వైద్యశాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాప్ డయేరియా పేరుతో ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. జూలై 1 నుండి 31వ తేదీ వరకు గ్రామాలలో డయేరియా నిర్మూలన పట్ల అవగాహన కార్యక్రమం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రమేష్, బాలాజినాయక్, సీహెచ్ఓ మురళి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

గుంతకల్లుటౌన్, జూన్25: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి పేర్కొన్నారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి మహిళలపై హింస, హత్య, అత్యాచారాలు విపరీతంగా పెరిగాయన్నారు. మహిళా చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రతి జిల్లాకు మహిళ ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలను హింసిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శు లు బీ జ్యోతి, బీ రంగమ్మ, సభ్యులు ఆదిలక్ష్మి, శాంతమ్మ, సుశీలబాయి, సుగుణ, ఉష, లక్ష్మీదేవి, గంగ రత్నమ్మ, భాను, గౌసియా, ఉసేన్‌బీ పాల్గొన్నారు.

29న ఎస్పీ బాలు జయంతి వేడుకలు

తాడిపత్రిటౌన్, జూన్25: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 29న గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పల్లవించవా నా గొంతులో స్వరార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తాడిపత్రిటౌన్, జూన్25: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

గుత్తి, జూన్ 25: పరిసరాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని జంగాల కాలనీలో మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మనకు ప్రాణ వాయువు అందించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాతావరణ కాల్యుష్యాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణ నష్టాన్ని అరికడదాం

యాడికి, జూన్ 25: ఓఆర్ఎస్, జింక్ మాత్రలు వినియోగించడం వలన విరేచనాల వలన కలిగే ప్రాణనష్టాన్ని అరికట్టవచ్చునని ప్రభుత్వ వైద్యుడు శ్రీరామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం యాడికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్టాప్ డయేరియా-విరేచనాల వల్ల కలిగే ప్రాణనష్టాన్ని ఆపుదాం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశాకార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అతిసార వ్యాధి లక్షణాలు వాటి వల్ల కలిగే ఇబ్బందులు, పరిణామాలు గురించి వివరించారు. రక్షణ చర్యల గురించి తెలియజేశారు. సమావేశంలో డాక్టర్ పరమేశ్వర్, సీహెచ్ఓ జుబేదా, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ,జూన్25: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, సుధాకర్ మంగళవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని వాణి విద్యానికేతన్, శాంతి నికేతన్ పాఠశాలలను వారు పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు ఒక చోట అనుమతి పొంది, మరో చోట నిర్వహిస్తున్నారన్నారు. గత ఆరేళ్లుగా ఇలాగే నిర్వహిస్తున్నా విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, నోటు పుస్తకాలను అధిక ధరలకు పాఠశాలలోనే అధిక విక్రయించడం దారుణమని మండిపడ్డారు. తక్షణమే విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రశాంత్, షబ్బీర్ పాల్గొన్నారు.

ఆరుగురి బైండోవర్

యల్లనూరు, జూన్25: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. గ్రామంలో వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ, వైసీపీ కార్యకర్తలను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గత ఏడాది పంటల బీమా ప్రకటించాలి

గుంతకల్లు టౌన్, జూన్ 25: గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన పంటల బీమా ప్రకటించాలని కోరుతూ మంగళవారం ఏపీ రైతు సంఘం నాయకులు తహసీల్దారు శేషపణికి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతు ఖాతాల్లో జమచేయాలన్నారు. కరువు నివారణకు ప్రత్యేక నిధులను ప్రకటించాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే జీఓ22ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దాసరి శ్రీనివాసులు, బీ శ్రీనివాసులు, తిమ్మప్ప, సాకే నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

విద్య, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు శివానంద

గుంతకల్లు టౌన్, జూన్ 25: విద్య, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని రోటరీ క్లబ్ నూతన్ అధ్యక్ష, కార్యదర్శులు జీ శివానంద, బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక రోటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూలై 1నుంచి 2024-25సంవత్సరం రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పడుతుందన్నారు. పేద విద్యార్థులకు విద్య, పుస్తకాల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు. 2023-24 సంవత్సరానికి ఇన్నర్‌వీల్ క్లబ్ ఉత్తమ డెడికేటెడ్ అధ్యక్షురాలిగా రేణుకా ఎంపికైందన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా అర్చనకార్వా, కార్యదర్శిగా కే సునీత త్వరలో బాధ్యతలు చేపడుతారన్నారు. ఈ సమావేశంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, రోటరీన్ శిరీష్, ఇన్నర్ వీల్ క్లబ్ రోటరీయన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య



ఎన్‌వీఎస్ఆర్ మూర్తి(ఫైల్)

గుంతకల్లుటౌన్, జూన్ 25: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఎన్‌వీఎస్ఆర్ మూర్తి (49) మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌వీఎస్ఆర్ మూర్తి స్థానిక స్టేషన్‌రోడ్డులో శిరిసాయి మొబైల్ షాపు నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నాడు. మూర్తికి అప్పులు ఉన్నాయని వాటిని ఎలా తీర్చాలో తెలియక బాధపడేవాడన్నారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైన గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. గమనించిన కుటుంబసభ్యులు మూర్తిని కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



మృతురాలు చైత్ర (ఫైల్)

బ్రహ్మసముద్రం: మండలంలోని పొబ్బర్లపల్లి గ్రామంలో హరిజన ఆదిమూర్తి భార్య చైత్ర (25) కడుపునొప్పి తాళలేక తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ పరశురాముడు తెలిపారు. ఐదేళ్ల కిందట ఆదిమూర్తితో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు కాగా ఒకరు అనారోగ్యంతో చనిపోయారన్నారు. గత కొద్దిరోజులుగా చైత్ర కూడా కడుపునొప్పితో బాధపడేవారని, చిత్రదుర్గం వైద్యశాలలో పరీక్షలు చేయించుకున్నా తగ్గలేదని తెలిపారు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో భర్త పొలం పనికి వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ పరశురాముడు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కళ్యాణదుర్గం వైద్యశాలకు తరలించారు.

లైసెన్స్ లేకుండా దాబా నిర్వహణ

తనిఖీకి వెళ్లిన ఫుడ్ సేఫ్టీ అధికారిణిపై నిర్వాహకుడి దుర్భాషలు



దాబాలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీం

అనంతపురం ప్రెస్ క్లబ్, జూన్ 25: తనిఖీకి వెళ్లిన ఫుడ్‌సేఫ్టీ అధికారిణిపై దాబా నిర్వాహకుడు దుర్భాషలాడిన సంఘటన గుత్తి మండలం కరిడికొండ గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. కరిడికొండ గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారికి పక్కనే రాయల్ దాబాను దాదాపు 20 ఏళ్లుగా ఎలాంటి లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్నారు. అక్కడ నాణ్యతలేని ఆహార పదార్థాలు ప్రజలకు అంటగడుతున్నట్లు ఓ వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీం దాబా తనిఖీకి వెళ్లారు. అయితే ఆమె దాబా నిర్వాహకుడు రాముతో పాటు అక్కడ ఉన్న వ్యక్తులు తమ దాబాలోనే ఎందుకు పరిశీలిస్తున్నారని, మీ అంతు చూస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చారని సమాచారం తెలుసుకున్న మీడియా సిబ్బంది అక్కడికి వెళ్లగా వారిపైన కూడా దురుసుగా ప్రవర్తించాడు. ఫ్రిడ్జ్‌లో కొన్ని రోజుల నుంచి నిల్వ ఉంచిన మసాలాలతో పాటు ఉడికించిన మాంసాన్ని అందులో ఉంచారు. పెరుగులో కూడా ఈగలు పడి చనిపోయాయి. పెరుగును ఫ్రిడ్జ్‌లో ఉంచారని, గడువు తీరిన సోయాసాసులను గుర్తించి సీజ్ చేశారు. కిచెన్‌లో ఎక్కడ చూసిన అపరిశుభ్రత నెలకొంది. తిను బండారాల్లో అధికస్థాయిలో కలర్లను వాడుతున్నట్లు అధికారిణి గుర్తించారు. స్టోర్ రూమ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల మసాలాలను ఉంచారని తెలిపారు. వీటన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీం తెలిపారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన 'వశికేరి'



మంత్రి అచ్చెన్నాయుడుతో వశికేరి జగదీశ్వర

గుంతకల్లుటౌన్, జూన్ 25: రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని మంగళవారం కలిసినట్లు మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ కుమారుడు టీడీపీ నాయకుడు వశికేరి జగదీశ్వర తెలిపారు. విజయవాడలోని మంత్రి నివాసంలో అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపానన్నారు. కార్యక్రమంలో యువనాయకులు వశికేరి పవన్, మహ్మద్‌అష్ఫాక్, శివరాజు పాల్గొన్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ బోల్తా పడి జార్ఖండ్ కూలీ మృతి

కణేకల్లు, జూన్ 25: మండలంలోని నాగేపల్లి వద్ద మంగళవారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విద్యుత్ పనులు చేసే కూలి సురేష్(55) మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు వద్ద జరిగే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు గాను సురేష్ ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలను తీసుకుని వెళుతుండగా నాగేపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జనసేన ఇన్‌చార్జ్



పవన్‌కళ్యాణ్‌ను కలిసిన మంజునాథ్ గౌడ్

రాయదుర్గం, జూన్ 25: జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను మంగళవారం కలిసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కే మంజునాథ్‌గౌడ్ తెలిపారు. అమరావతిలో ఉపముఖ్యమంత్రి పేషీలో ఆయన్ను కలిశారు. భవిష్యత్‌లో కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని పార్టీ అందించి గౌరవిస్తుందని పవన్ హామీ ఇచ్చినట్లు మంజునాథ్‌గౌడ్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఉరవకొండ, జూన్ 25: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపాల్ మమత పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం ఆపాలి

ఉరవకొండ, జూన్ 25: దేవాలయ భూముల వేలం పాటను ఆపేయాలని డీజీహెచ్ఎస్ నాయకులు మంగళవారం దేవదాయశాఖ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. వజ్రకరూరు మండలంలోని కాశీ విశ్వేశ్వర, ఈశ్వర, సుంకులమ్మ, ఆంజనేయస్వామి దేవాలయభూమలను గత 45 సంవత్సరాలుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. 45ఏళ్ల నుంచి కౌలు రూ.50ల నుంచి రూ.5వేలవరకూ చెలిస్తూ సాగు చేసుకుంటున్న పేదలను కాదని ఇప్పుడు కొత్తగా వేల పాట నిర్వహించడం తగదన్నారు. కార్యక్రమంలో డీజీహెచ్ఎస్ నాయకులు గోపాల్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు బాబు, ఎల్లన్న పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

గుంతకల్లుటౌన్, జూన్ 25: పట్టణంలోని మూడు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కే స్వాతి మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాలలో విక్రయిస్తున్న కంది, ఆముదము విత్తనాల రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో నకిలీ, కల్తీ విత్తనాలు రైతులకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని షాప్‌ను సీజ్ చేస్తామని దుకాణదారులను హెచ్చరించారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోండి

కళ్యాణదుర్గం, జూన్ 25: రైతులు తమ పంట రుణాలను ఈ నెల 30 లోపు రెన్యువల్ చేసుకోవాలని కంబదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో ముత్యాలప్ప మంగళవారం తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీతో కలిగిన పాన్‌కార్డు, ఓటర్ కార్డు, జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌ఫొటోలను సహకార సంఘంలో అందజేయాలన్నారు. రైతులందరు గడువులోగా రెన్యువల్ చేసుకుని సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.